క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

చెన్నూర్: విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడకుండా ఉండేందుకు సబ్‌స్టేషన్‌లో 5ఎంవీఏ కెపాసిటీ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో 8ఎంవీఏ కెపాసిటీ కలిగిన పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను అమర్చనున్నట్లు ట్రాన్స్‌కో ఎస్ఈ వి.గంగాధర్, డీఈ ఖైసర్, ఏడీఈ బాలకృష్ణ తెలిపారు. మరమ్మతుల కారణంగా చెన్నూర్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు గురువారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 4గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

దండేపల్లి: జన్నారం, దండేపల్లి, లక్సెట్టిపేట మండలంలోని జెండా వెంకటాపూర్ విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధి గ్రామాల్లో గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని లక్సెట్టిపేట విద్యుత్ శాఖ ఏడీఈ ప్రభాకర్‌రావు తెలిపారు. 33కేవీ విద్యుత్ లైన్ల మరమ్మతులు చేపడుతున్న కారణంగా ఉదయం 9గంటల నుంచి 11గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలన్నారు.

ఆహారపట్టిక అమలుపై ఆరా



విద్యార్థులతో మాట్లాడుతున్న తిరుపతి

మంచిర్యాలఅర్బన్: డైట్ చార్జీలు, కాస్మొటిక్ చార్జీలు పెరిగాయి.. నాణ్యమైన భోజనం అందిస్తున్నారా..? ఆహార పట్టిక (మెనూ)అమలు చేస్తున్నారా అంటూ బీసీ సంక్షేమ శాఖ సంయుక్త కార్యదర్శి తిరుపతి విద్యార్థులను ఆరా తీశారు. మంచిర్యాల బీసీ బాలికల కళాశాల వసతిగృహంను బుధవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. హాస్టల్ గదులు, పరిసరాలను కలియతిరిగారు. విద్యార్థులకు ప్రభుత్వం తరఫున అందుతున్న సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట బీసీ సంక్షేమ అభివృద్ధి అధికారి పురుషోత్తం నాయక్, బీసీ బాలుర, బాలికల వసతి గృహం వార్డెన్లు మోసిన్, సుధలున్నారు.

బీసీ గర్ల్స్ హాస్టల్ సందర్శన

మందమర్రిరూరల్: మందమర్రి పాత బస్టాండ్ ఏరియాలోని ప్రభుత్వ బీసీ గర్ల్స్ హాస్టల్‌ను బీసీ సంక్షేమ శాఖ సంయుక్త కార్యదర్శి తిరుపతి బుధవారం సందర్శించారు. విద్యార్థినులతో మాట్లాడి సౌకర్యాలు అడిగి తెలుసుకున్నారు. హాస్టల్ పరిసరాలు పరిశీలించారు. విద్యార్థులు లక్ష్యం ఎంచుకొని ఉన్నతమైన చదువులు చదవాలన్నారు. విద్యార్థులపై శ్రద్ధ వహించాలని హాస్టల్ వార్డెన్ నూర్జాహాన్‌కు సూచించారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా



విద్యార్థులతో ఎస్ఓలు, ఉపాధ్యాయులు

వేమనపల్లి: మండలంలోని నీల్వాయి జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో మొదటి వార్షికోత్సవ కార్యక్రమం బుధవారం విద్యార్థుల నృత్యాలతో హోరెత్తింది. జిల్లా ఎస్ఓలు సత్యనారాయణ మూర్తి, రాజ్‌కుమార్ హాజరై విద్యార్థులను అభినందించారు. నృత్యాలు, క్రీడా పోటీలు అలరించాయి. నాటికలు, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్డీఎఫ్ సెక్రెటరీ ఫణిరాజ, మాజీ జెడ్పీటీసీ సంతోష్ కుమార్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సాబీర్‌అలీ, నాయకులు గాలి మధు, సమ్మయ్య, హెచ్ఎం గిరిధర్‌రెడ్డి, పీఈటీ మల్లేష్ పాల్గొన్నారు.

ఎంవీటీసీలో రక్తదాన శిబిరం



రక్తదాతకు ప్రశంస పత్రం ఇస్తున్న జీఎం

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని పాలచెట్టు ఏరియాలో గల గనుల వృత్తి శిక్షణా కేంద్రం (ఎంవీటీసీ)లో సింగరేణి, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా ఏరియా జీఎం దేవేందర్ హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సింగరేణిలో నూతనంగా ఉద్యోగంలో చేరిన యువ కార్మికులు రక్తదానం చేయడం సంతోషంగా ఉందన్నారు. ఇప్పటివరకు ఎంవీటీసీలో 40రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయగా 2856యూనిట్ల రక్తం రెడ్‌క్రాస్ సొసైటీకి అందజేసినట్లు తెలిపారు. అనంతరం రక్తదాతలకు ప్రోత్సాహకంగా ప్రశంసా పత్రాలు అందించారు. కార్యక్రమంలో ఏరియా ఎస్వోటు జీఎం విజయ్‌ప్రసాద్, ఎంవీటీసీ మేనేజర్ శంకర్, ట్రైనింగ్ ఆఫీసర్ అశోక్‌కుమార్, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి సత్యనారాయణ, ప్రభుత్వ వైద్యాధికారి రమేష్, రెడ్‌క్రాస్ సొసైటీ మేనేజ్మెంట్ కమిటీ సభ్యుడు శ్రీనివాస్, తలసేమియా వెల్ఫేర్ సొసైటీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రంజిత్‌కుమార్ ఉన్నారు.

తాగునీటికి ఇక్కట్లు



కోటపల్లి: మండలంలోని నక్కలపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని బ్రహ్మణపల్లి గ్రామం ఎస్టీ కాలనీలో తాగునీటి అవసరాల కోసం వేసిన బోర్ మోటారు చెడిపోయి నెలలు గడుస్తున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడంలేదని కాలనీవాసులు తెలిపారు. అధికారులను అడిగితే కొత్త బోరు వేసేందుకు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపామని అంటున్నారే తప్పా, తమ నీటి సమస్యను తీర్చడంలేదని మండిపడుతున్నారు. తాగేందుకు మంచినీరు లేక దూరప్రాంతాలకు వెళ్లి తీసుకురావాల్సి వస్తుందన్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని ఎస్టీ కాలనీవాసులు కోరుతున్నారు.

పచ్చదనం.. ఆహ్లాదకరం

జన్నారం: వేసవిలో రోజురోజుకు ఎండలు పెరిగిపోతుంటే ప్రజలు బయటకు రావాలంటే జంకుతున్నారు. మండలంలోని కలమడుగు, ధర్మారం గ్రామాల మధ్య గల బీటీ రోడ్డుకు ఇరువైపులా గత ప్రభుత్వ హయాంలో హరితహారంలో భాగంగా నాటిన మొక్కలు, ప్రస్తుతం చెట్లుగా మారి బాటసారులను కనువిందు చేస్తున్నాయి. చల్లని నీడను ఇస్తూ ఆహ్లాదాన్ని పంచుతున్నాయి.



ఆస్పత్రిలో తాగునీరేది?



నెన్నెల: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తాగునీరు లేక రోగులు, వెంట వచ్చే సహాయకులతో పాటు సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆరోగ్య కేంద్రానికి వైద్య పరీక్షల కోసం వచ్చే గర్భిణులు గ్లాసు మంచినీళ్లు తాగాలన్న గుక్కెడు నీరు దొరకదు. వారం రోజులుగా మధ్యాహ్న సమయంలో సూర్యుడు విశ్వరూపం దాల్చడంతో గొంతు తడుపుకునేందుకు నరకయాతన పడుతున్నారు. ఆస్పత్రిలో తాగునీరు అందుబాటులో లేకపోవడంతో పీహెచ్‌సీకి వచ్చిన రోగులు ఎండలో కిలోమీటర్ దూరం గ్రామంలోకి వెళ్లి షాపుల్లో రూ.20 చెల్లించి వాటర్‌బాటిళ్లు కొనుగోలు చేయాల్సి రాగా, సిబ్బంది ఇంటి నుంచే వాటర్ బాటిళ్లు తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఉందని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆస్పత్రిలో ఉన్న వాటర్‌ఫ్రిజ్ చెడిపోయి రెండేళ్లు అవుతున్నా, మరమ్మతు చేయించకపోవడంతో మూలనపడింది. ఇప్పటికైనా అభివద్ధి కమిటీ సమావేశం ఏర్పాటు చేసి ఆరోగ్య కేంద్రంలో ఉన్న ఫర్నీచర్ కొరత తీర్చడంతో పాటు వేసవిలో రోగుల దాహం తీర్చేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

'కార్పొరేషన్'కు కొత్త హంగులు

- సర్వాంగ సుందరంగా ఐబీ జంక్షన్
- పాత పార్లమెంట్ ఆకృతిపై అంబేడ్కర్ విగ్రహం
- వాటర్ ఫౌంటేన్, గ్రీనరీతో ఆకట్టుకునేలా..
- ఈ నెల 14న ప్రారంభం



పనులు చేపడుతున్న కార్పొరేషన్ అధికారులు

మంచిర్యాలటౌన్: నూతనంగా ఏర్పాటైన మంచిర్యాల కార్పొరేషన్‌కు కొత్త హంగులు అలుముకుంటున్నాయి. జిల్లా కేంద్రంలోని ప్రధాన చౌరస్తాగా పేరుగాంచిన ఐబీ చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహం జంక్షన్‌ను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. గతంలోనే ఉన్న 7 ఫీట్ల అంబేడ్కర్ విగ్రహాన్ని తొలగించి, దాని స్థానంలో కొత్తగా 12ఫీట్ల అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నారు. ఈ నెల 14న డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని, కార్పొరేషన్ నిధులు జనరల్ ఫండ్‌లో నుంచి రూ.72లక్షలతో ఏర్పాటు చేస్తున్న అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించేందుకు వేగంగా పనులు చేపడతున్నారు. గతంలో సుందరీకరణలో భాగంగా ఐబీ జంక్షన్‌ను రూ.1కోటికి పైగా ఖర్చు చేసి నిర్మించారు. ఇది ఎక్కువ వ్యాసంలో ఉండడంతో దీని వల్ల ట్రాఫిక్‌కు ఇబ్బందులు, పలు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని, గత మున్సిపల్ పాలకవర్గం జంక్షన్‌ను కుదించాలని తీర్మానం చేశారు. ఐబీ చౌరస్తా నుంచి శ్రీనివాస గార్డెన్ వరకు ఆరు లైన్ల రహదారి విస్తరణ పనులు త్వరలోనే ప్రారంభం అవుతుండడంతో, జంక్షన్ వ్యాసాన్ని తగ్గించేలా చర్యలు ప్రారంభించారు.

12ఫీట్ల అంబేడ్కర్ విగ్రహంతో..

ఐబీ చౌరస్తాలోని అంబేడ్కర్ జంక్షన్ వెడల్పును తగ్గించిన అనంతరం ఆ స్థలాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దేందుకు గాను రూ.72లక్షల కార్పొరేషన్ జనరల్ ఫండ్ నిధులు కేటాయించారు. ఐబీ చౌరస్తా రూ.72లక్షల నిధులు, జనరల్ ఫండ్ నుంచి పెట్టారు. ఈ జంక్షన్‌లో పాత పార్లమెంట్ భవన నమూనాను 6 ఫీట్ల ఎత్తు, 3 మీటర్ల వ్యాసార్థంతో నిర్మించి, దానిపైన 12ఫీట్ల అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నారు. ఫౌంటేయిన్ కోసం 2 ఫీట్ల ఎత్తు నిర్మించి, 6మీటర్ల వ్యాసార్థంతో ఉండేలా ఏర్పాటు చేస్తుండగా, ఔటర్ వాల్ వ్యాసార్థం 10మీటర్లు ఉండేలా జంక్షన్‌ను నిర్మించి, అందులో గార్డెన్‌ను ఏర్పాటు చేస్తున్నారు. దీని నిర్మాణం పూర్తయితే, పట్టణానికి కొత్త శోభ రావడంతో పాటు, ఐబీ చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహం ఇతర ప్రాంతాల్లో ఏర్పాటు చేసే వారికి దిక్సూచిగా భావిస్తుందని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు భావిస్తున్నారు. రాత్రి, పగలు అనే తేడా లేకుండా నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తిచేసి, 14వ తేదీన అంబేడ్కర్ జయంతిని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- చెన్నూరు ఎమ్మెల్యే వివేక్



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే

భీమారం: అర్హులైన పేదలందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తామని చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ తెలిపారు. మండల కేంద్రంలో బుధవారం జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా ఆవిడం రోడ్డు నుంచి బస్టాండ్ వరకు జాతీయ రహదారిపై పాదయాత్ర చేశారు. అనంతరం బస్టాండ్ వద్ద గల అంబేడ్కర్ విగ్రహానికి వివేక్ వెంకటస్వామి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రభుత్వం పేదలకు అండగా నిలుస్తోందని, బీఆర్ఎస్ ప్రభుత్వంలో పేదలకు న్యాయం జరగలేదని ఆరోపించారు.

రాజ్యాంగాన్ని కాపాడుకునేందుకే పాదయాత్ర

మంచిర్యాలటౌన్: స్వాతంత్ర భారతదేశాన్ని కాపాడుకుంటూ, రాజ్యాంగాన్ని కాపాడుకుందామని కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు. జిల్లా కేంద్రంలోని 4వ వార్డులో మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు, డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ ఆదేశాల మేరకు జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ పాదయాత్రను బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పూదరి తిరుపతి ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు తూముల నరేశ్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ సల్ల మహేశ్, రామగిరి బానేశ్, గజ్జల హేమలత, సంజీవ్‌రావు పాల్గొన్నారు.

వాల్ రైటింగ్ రాసిన మాజీ ఎమ్మెల్యే తనయుడు



వాల్ రైటింగ్ రాస్తున్న విజిత్‌రావు

మంచిర్యాలటౌన్: వరంగల్‌లో ఈ నెల 27వ తేదీన నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ సభ విజయవంతం చేయాలంటూ జిల్లా కేంద్రంలోని ఓవర్ బ్రిడ్జి వద్ద మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు తనయుడు బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు నడిపెల్లి విజిత్‌రావు వాల్‌రైటింగ్ రాశారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవ సభకు పార్టీ అభిమానులు, నాయకులు హాజరు కావాలని కోరారు.

బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం

- జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్‌గౌడ్



కన్నెపల్లిలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్‌గౌడ్

భీమిని: బీజేపీ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్‌గౌడ్ అన్నారు. భీమిని, కన్నెపల్లి మండలాల్లో బుధవారం క్రియాశీల సభ్యులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వం చేపట్టే అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. స్థానిక సమస్యలపై ప్రశ్నిస్తూ ప్రజల పక్షాన నిలబడాలని పార్టీ నాయకులకు సూచించారు. కార్యక్రమంలో భీమిని, కన్నెపల్లి మండలాల బీజేపీ అధ్యక్షులు సత్యనారాయణ, రామయ్యయాదవ్, నాయకులు పుల్లూరి రాజయ్య, శంకర్, శ్రీనివాస్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సన్నబియ్యం పరిశీలన

కాసిపేట: మండలంలోని దేవాపూర్, కాసిపేట గ్రామాల్లో బుధవారం బీజేపీ మాజీ ఎమ్మెల్యే అమురాజుల శ్రీదేవి ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. అనంతరం మండలాధ్యక్షుడు సూరం సంపత్‌కుమార్‌తో కలిసి రేషన్ షాపులను సందర్శించారు. బియ్యాన్ని పరిశీలించారు. సన్నబియ్యం నాణ్యత, రేషన్ షాపు నిర్వహణ సమయాన్ని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి రెడ్డి బాలరాజు, నాయకులు దేవునూరి సంతోష్, పెద్దపల్లి శంకర్, వనిత, చారులత, చొప్పదండి విష్ణువర్ధన్, అయిలి సురేందర్, భైరినేని మల్లేష్, రంజిత్, తదితరులున్నారు.

'గావ్ చలో.. బస్తీచలో'పై సమావేశం

దండేపల్లి: బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించే 'గావ్ చలో.. బస్తీ చలో' కార్యక్రమం పై మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం పార్టీ నాయకులు సమావేశం అయ్యారు. కార్యక్రమానికి పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు కృష్ణమూర్తి హాజరై మాట్లాడారు. ప్రతి గ్రామానికి ఒక ఇన్‌చార్జీని నియమించి, పార్టీ విశిష్టతను ప్రజలకు వివరించి, గ్రామస్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు రాజయ్య, నాయకులు పాల్గొన్నారు.

నెన్నెల తహసీల్దార్‌గా మహేందర్‌నాథ్

నెన్నెల: మండల తహసీల్దార్‌గా బి.మహేందర్‌నాథ్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేసిన తహసీల్దార్ సబ్బు రమేష్ భూపట్టాల వ్యవహారంలో అవకతవకలకు పాల్పడటంతో కలెక్టర్ సస్పెండ్ చేశారు. నూతన తహసీల్దార్ మాట్లాడుతూ.. రైతులకు, విద్యార్థులకు, ప్రజలకు ఇబ్బంది లేకుండా అన్ని విధాల సహకరిస్తానని, ఎవరు కూడా దళారులను ఆశ్రయించొద్దని సూచించారు. నేరుగా తనను సంప్రదించాలని కోరారు. డీటీ ప్రకాష్, ఆర్ఐ సులోచన, సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు.

రాంజీ గోండు వర్ధంతి

కాసిపేట: మండలంలోని దేవాపూర్, తాటిగూడ గ్రామాల్లో బుధవారం తొలి స్వాతంత్ర్య సమరయోధుడు మర్సకోల రాంజీ గోండు వర్ధంతిని ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన పోరాట ప్రతిమను కొనియాడారు. దేవాపూర్ గ్రామపంచాయతీ ఆవరణలోని కమ్యూనిటీ హాల్లో నాయకులు కొమ్ముల బాపు, కనకరాజు, కోంరం జనార్దన్, సంద్ర భూమయ్య, రెడ్డి లక్ష్మణ్, పెంద్రం ప్రభాకర్, కుర్సింగ మహేశ్వర్, తాటిగూడ మోడల్ స్కూల్ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో మడావి వెంకటేష్, పెంద్రం శంకర్, పాఠశాల హెచ్ఎం మంగ రమాదేవి, బద్దుల స్వరూప, మడావి శేఖర్ తదితరులున్నారు.

'మహనీయులను మరువొద్దు'

జన్నారం: చరిత్రలో ప్రత్యేక గుర్తింపు పొందిన మహనీయులను ఆదర్శంగా తీసుకొని, ఉత్సవాలను జరుపుకోవాలని బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి భుక్య జాన్సన్‌నాయక్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో తెలంగాణ నేతకాని మహార్ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సాయిని ప్రసాద్‌నేత ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'మహనీయుల జయంతి ఉత్సవాల' పోస్టర్‌ను బుధవారం నాయకులతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో జన్నారం మండల సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షుడు జాడి గంగాధర్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్లు ఒల్లాల నర్సాగౌడ్, జంగం సంతోష్, నేతకాని కుల సంఘం రాష్ట్ర నాయకులు బోర్లకుంట ప్రభుదాస్, ఎస్‌సీటీ సంస్థ సభ్యులు మంతెన వెంకటేష్, పాండేటి సతీష్, అల్లూరి వినోద్ తదితరులు పాల్గొన్నారు.

పెట్రో ధరలు తగ్గించాలని రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న సీపీఐ శ్రేణులు

బెల్లంపల్లి/జన్నారం: పెంచిన పెట్రో ఉత్పత్తుల ధరలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ బుధవారం బెల్లంపల్లిలోని బీఆర్ అంబేడ్కర్(కాంటా) చౌరస్తా వద్ద, జన్నారం మండలంలో, సీపీఐ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు ఎం.వెంకటస్వామి, బొల్లం పూర్ణిమ మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలు అవలంభిస్తోందని విమర్శించారు. ధరలు తగ్గించకపోతే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లిలో సీపీఐ పట్టణ కార్యదర్శి ఆడేపు రాజమౌళి, మండల కార్యదర్శి బొంతల లక్ష్మీనారాయణ, సహాయ కార్యదర్శి కె.రాజేష్, సీనియర్ నాయకులు జీసీ మాణిక్యం, గుండా సరోజ, బానేష్, రత్నం రాజం, జన్నారంలో సీపీఎం మండల ప్రధాన కార్యదర్శి కనికరపు అశోక్, సీపీఐఎం మండల నాయకులు కొండగుర్ల లింగన్న, బుచ్చయ్య, మగిడి జయ, లక్ష్మణ్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

'సిలిండర్ ధర తగ్గించకుంటే ఆందోళన'

చెన్నూర్: కేంద్ర ప్రభుత్వం కార్పొరేటర్లకు రుణాలు రద్దు చేసి ఖజానా నింపుకోవడానికి ప్రజలపై భారాలు వేస్తుందని సీపీఎం జిల్లా కార్యదర్శి సంకె రవి అన్నారు. చెన్నూర్‌లో ఎండీ కరీం అధ్యక్షతన బుధవారం ఏరియా కమిటీ సమావేశం నిర్వహించగా ఆయన హాజరై మాట్లాడారు. మోడీ ప్రభుత్వం గ్యాస్ సిలిండర్ ధర పెంచి పేద ప్రజలపై భారం మోపుతుందన్నారు. పెంచిన గ్యాస్ సిలిండర్ ధర తగ్గించకపోతే జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో సీపీఎం నాయకులు చందు, శ్యామల ఉమారాణి, సిడం సమ్మక్క, సరిత, నాగజ్యోతి, రమాదేవి పాల్గొన్నారు.

సన్నబియ్యం... సంబురంగా భోజనం



గిరిజనులతో అధికారుల సహపంక్తి భోజనం



మల్లంపేటలో భోజనం అధికారులు

తాండూర్: మండలంలోని నర్సాపూర్ గ్రామపంచాయతీ ఆదివాసీల్లో ఆనందం వెల్లివిరిసింది. రాష్ట్ర ప్రభుత్వం సరఫరా చేసిన సన్నబియ్యంతో అన్నం వండి గిరిజనులు సంబురంగా భోజనం చేశారు. నర్సాపూర్ గ్రామంలో బుధవారం కొత్త రేషన్‌షాపును బెల్లంపల్లి ఆర్డీవో పి.హరికృష్ణ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈసందర్భంగా లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీ చేశారు. గిరిజనులతో కలిసి ప్రభుత్వ అధికారులు సహపంక్తి భోజనం చేసి ఆనందాన్ని మరింత రెట్టింపు చేశారు.ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ్ పక్వాడా నిర్వహించారు. ఆర్డీవో హరికృష్ణ, తహసీల్దార్ ఇమ్రాన్‌ఖాన్, సీఐ కుమారస్వామి చిన్నారులకు అక్షరాలు దిద్దించారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, ఎంపీడీవో శ్రీనివాస్, ఎస్సై సౌజన్య పాల్గొన్నారు.

కోటపల్లి: సన్నబియ్యం పథకాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ రాఘవేంద్రరావు అన్నారు. మల్లంపేటకు చెందిన బత్తుల పోశం ఇంట్లో బుధవారం భోజనం చేసి పరిశీలించారు. రేషన్‌షాపుల్లో సన్నబియ్యం పంపిణీపై డీలర్లను అడిగి తెలుసుకున్నారు. డీటీ నవీన్‌కుమార్, ఎంపీవో అక్తర్, కార్యదర్శులు పాల్గొన్నారు.

చర్యలు తీసుకునేంత వరకు ఆందోళన

- నేడు రౌండ్‌టేబుల్ సమావేశం



మాట్లాడుతున్న ఆదివాసీ సంఘం నాయకులు

వేమనపల్లి: మంగెనపల్లిలో ఇటీవల మృతి చెందిన కన్నయ్య కుటుంబానికి న్యాయం జరిగేంత వరకు ఆదివాసీల పోరాటం ఆగదని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు బాగాల రాజన్న, కార్యదర్శి ఎర్మ పున్నం అన్నారు. ఈ నెల 10న ఆదివాసీ దళిత కుల సంఘాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. కన్నయ్య కుటుంబానికి చెందిన సీలింగ్ పట్టా భూమిని అక్రమంగా పట్టా చేయించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. యజమాని ఎనగంటి చిన్నన్న, అతడి భార్య లక్ష్మీ వేధింపుల వల్లే కన్నయ్య మృతి చెందాడని, భార్యభర్తలపై అట్రాసిటీ కేసు నమోదు చేసి శిక్షించాలని కోరారు. సమావేశానికి దళిత, గిరిజన సంఘాలు హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు మల్లేశ్వరి, శంకర్, నాగమల్లు, దుర్గ, వెంకటక్క, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలు కాపాడుకోవాలి



దేవాపూర్‌లో రాయ్ చర్చలో పాల్గొన్న ఆదివాసీలు

కాసిపేట: ప్రస్తుత సమాజంలో ఆర్థిక, విద్య, వైద్య, టెక్నాలజీ తదితర రంగాల్లో అభివృద్ధి చెందుతూ ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలని ఆదివాసీల సంఘం జాతీయ నాయకుడు సిడాం అర్జు సూచించారు. మండలంలోని దేవాపూర్ కమ్యూనిటీ హాల్లో రాంజీగోండ్ ఆర్థిక, సామాజిక, సంస్కృతి అంశాలపై బుధవారం నిర్వహించిన రాయ్ చర్చ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. గోండుల పుట్టుక ఎలా ఏర్పడింది, గావేగడ గ్రామంలో పటేల్ ప్రజల ఆలనా.. పాలనా గురించి వివరించారు. కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు ఆడ జంగు, పెందోర్ హన్మంతు, వెడ్మ కిషన్, రాయిసిడాం రాము, మడావి ధర్మరావు, సోయం సూరు, కనక గోవర్ధన్, తిరుపతి తదితరులున్నారు.

అందాల పోటీలను వ్యతిరేకిస్తూ కరపత్రాలు



కరపత్రాలతో మహిళా నాయకులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ప్రపంచ అందాల పోటీలను వ్యతిరేకిస్తూ హాజీపూర్ మండలం కర్ణమామిడిలో ప్రగతిశీల మహిళా సంఘం(స్త్రీ విముక్తి–పీఓడబ్ల్యూ) ఆధ్వర్యంలో బుధవారం ప్రచార కరపత్రాలు విడుదల చేశారు. పీఓడబ్ల్యూ జిల్లా కన్వీనర్ లావణ్య, ఏఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి మేకల పోచమల్లు మాట్లాడుతూ ప్రపంచ సుందరి పోటీలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీఓడబ్ల్యూ జిల్లా నాయకురాలు రాజేశ్వరి, రీనా, ప్రసన్న, రజిత, గోపిక, ఏఐఎఫ్‌టీయూ జిల్లా నాయకుడు రాజ్‌కుమార్ పాల్గొన్నారు.